కథానిక

# అపస్వరాలు

తిరునగర్

పండంటి పిల్లాణ్ణి పక్కలో చూచినా శాంతమ్మకి ఆదివారం అమావాస్యరోజున పుట్టాడనే అసంతృప్తి మాత్రం పోనేలేదు. పరంధామయ్య పరమానందం పొందుతూ భార్య అసంతృప్తికి కారణం తెలీక "ఏం"అన్నాడు?

"పచ్చిదొంగవుతాడుట!" అంది శాంతమ్మ పురిటి మంచంమీద పడుకునే.

"ఛీ! ఎవరుచెప్పారు? బంగారంవంటి కొడుకుని చూచి సంతోషించక దొంగవెధవవుతాడంటావేమిటి?"అన్నారు.

"పోనీ నక్షత్రమైనా మంచిది గాదు" అంది శాంతమ్మ మళ్ళీను.

"అసలు నీకు తెలీదుగాని అమావాస్యరోజున పుడితే రాజభోగం అనుభవిస్తారుట"అని సమర్థించాడు పరంధామయ్య.

దోష పరిహారార్థం శాంతమ్మ శాంతిచేయించిందాకా వూరుకోలేరు. భార్యపోరు, ఆమె తల్లి పోరుపడలేక పరంధామయ్యగారు గూడా శాంతి బాగానే జరిపించారు. ఆయనకి పిల్లలంటే అమిత ప్రేమ. మూడు కాన్పులకీ ఆడపిల్లలే పుట్టారు. అయినా అంతగా విచారించలేదు. ఏదో అసలు సంతతంటూ కలిగిందని. కాని ఆ ముగ్గురూ నెలల్లోనే చనిపోయారు. చివరికి గోపీమాత్రం మిగిలాడు. తరువాత కాన్పు ఇది. అంచేత పరంధామయ్యకు ఇద్దరి కొడుకులమీదా ప్రేమ ఎక్కువే. దానిముందు అమావాస్యలూ, ఆదివారాలూ లెక్కలోనికి రావు.

శాంతమ్మ శాంతిచేయించి దోషాన్నయితే తొలగించగలిగింది గాని తన మనసులో వున్న కలంకు మాత్రం తొలిగించుకోలేకపోయింది. గోపాలకృష్ణుడు పెద్దబ్బాయి ఎలాగో వున్నాడు గనుక రెండో అబ్బాయికి రాముడిపేరు పెడతానని పరంధామయ్యగారు "రాంబాబు" నామకరణం చేశారు.

రాంబాబు అన్నప్రాశనకు కలం, పుస్తకాలు, బంగారపు గొలుసు ముందుపెడితే వెళ్ళి బంగారపు గొలుసే పట్టుకున్నాడు. తండ్రి "నే చెప్పలేదటే! రాముడు రాజభోగం అనుభవిస్తాడని" అన్నాడు. కాని తల్లి ఇంకోరకంగా అర్థం చెప్పుకుంది-"బంగారపు గొలుసు పట్టుకున్నాడు-దొంగ అవుతాడుగాబోలు. గోపీకి అన్నప్రాశనప్పుడు వాడువెళ్ళి కలం పుస్తకాలు పట్టుకోలే?" అనుకుంది. రాంబాబు జీవితాన్ని ఎలాగయినా ఓ నిర్ణీతమైన పరిధిలో వుంచి ఆకారాన్ని ఏర్పరచాలనుకుంది.

రాంబాబు పెరుగుతున్నకొద్దీ తల్లికి అతనిలో అమావాస్యనాడు జన్మించినందుకు లక్షణాలు కనిపించసాగాయి. గోపీ ఎవరిజోలికీ వెళ్ళేవాడు గాదు. పెంకిపట్టుపట్టి మారాంచేసేవాడూగాదు. రాముడలా కాదు. ప్రతిదానికీ పెంకిపట్టుపట్టి తనపట్టుదలనెగ్గేదాకా వూరుకోడు. ప్రతివాళ్ళతోనూ పేచీలే. శాంతమ్మ "చిన్నతనంలే!" అని ఉపేక్షించి వూరుకోలేదు. భవిష్యత్ జీవితానికి ఇప్పట్నించీ చర్య తీసుకోకపోతే లాభం లేదనుకుంది.

పరంధామయ్య ఎప్పుడన్నా ఆఫీసు పనిమీద వూరు వెళుతూ వుంటాడు. రాంబాబుకి తండ్రి వూళ్ళో లేకపోతే తనకి దెబ్బలకు కొదువలేదని తెలుసు. అంచేత అప్పుడుమాత్రం ఏమీ అల్లరి చెయ్యకుండా ఎంతో కష్టంమీద కాలుచేతులు కట్టేసుకొని చివరికి కళ్ళనుగూడా కట్టేసుకుని బుద్ధభగవానునిలా ఎంతో బుద్ధిగా ఇంట్లో కూర్చుంటాడు; పెద్ద చదివేవాడిలా పుస్తకాలు ముందు వేసుకొని, ఇదంతా తనకై తనకు పుట్టింది గాదు. అమ్మ అన్నయ్య గోపీలా వుండకపోతే వెంటనే తిక్కవదిలిస్తుంది. పరంధామయ్య ఎప్పుడోగాని వూరు వెళ్ళేవారు కాదు. అంచేత ఈ అగ్నిపరీక్ష ఎప్పుడోగాని తటస్థించేదిగాదు. ఆయన వూళ్ళోవున్నప్పుడు శాంతమ్మ రాంబాబుని ఉపేక్షించి వూరుకొనేదిగాదుగానీ, భర్త కొట్ట

నిచ్చేవాడుగాదు. తండ్రి ఇంట్లోవుంటే ఇక రాంబాబు అల్లరిచెప్ప నలవిగానంతగా వుంటుంది. ఒకోక్కసారి ఆయనకూ విసుగుపుట్టేదిగాని మమ కారం ఏమీ అననిచ్చేది కాదు. ఎంత గల్లంతు చేస్తున్నా రాంబాబంటే ఎంచేతో తండ్రికి ఓ ప్రత్యేకాభిమానం. అయినా ఒక్కొక్కప్పుడు తల్లి కొడుకుని దండిస్తున్నా ఏమీ అడ్డుచెప్పే వాడుగాదు. భయంవుండాలని ఆయనకూ తెలుసు.

గోపీ చాలా చురుకైనవాడే! మంచి తెలివి తేటలుగలవాడు. అయినా అబద్ధాలాడడంగాని, చిన్నయెత్తు విషయంలో ఇంకోరితో కలుగజేసు కోవడంగాని వాడికిక్కట్టదు. వాడి పెద్దమనిషి తరహా మాచి పరంధామయ్య లోలోన ఎంతో సంతోషించేవారు. గోపాలం సెకండుఫారం చదువుతున్నాడు. రాంబాబు అయిదో తరగతి రాంబాబు గోపాలానికున్న చురుకుదనంలోనూ, తెలివితేటల్లోనూ ఏమాత్రం తీసిపోడు. వాళ్ళిద్ద రికీ ఒక్కటే తేడా! చేసినది తప్పుపనైనా సమ ర్థించుకోనేందుకు ఎలాటి అబద్ధాన్నైనా వీరు నిలా ఘంటాపదంగా చెప్పేస్తాడు రాంబాబు. గోపీకి అది చేతగాదు. "ఛీ! వీడి కసలు గుండె ల్లేవు" అనుకుంటారు.

ఓరోజు తనేదో చేస్తే అమ్మ స్తంభానికి కట్టేసి కొట్టినందుకు ఏడుస్తూ కూర్చున్నాడు. గోపీ చూచి నవ్వాడు. తనకి కోపంవచ్చింది. ఏమిటి చేయడం? ఇంట్లో గనుక ఏమైనాచేస్తే అమ్మ ఇచ్చే ఇంకో వాయనానికి సిద్ధపడి వుండాలి. మధ్యాహ్నం పరంధామయ్య వచ్చాక రాముడి ప్రతాపం శాంతమ్మద్వారా విని "ఓరి వెధవా!" అని బుగ్గగిల్లి లోపలికి తీసికెళ్ళాడు.

భోజనాలయ్యాక, "రేపు నేను గుంటూరు వెళ్ళాలి. నాలుగురోజులవరకూ రాను. నీ దగ్గర అరవై రూపాయలున్నాయిగా" అన్నారు పరం ధామయ్య భార్యతో. రాత్రి రాంబాబు నాన్న వూరెళ్ళిపోయినట్లు అల్లరిచేసినందుకు అమ్మ కొట్టి నట్లూ కలగన్నాడు.

ప్రొద్దున్నే పరంధామయ్య ప్రయాణమయ్యారు రాంబాబు "నేనూ వస్తా నాన్నా. అక్కడ పెద్దమ్మవుందిగా. అక్కడుంటాను" అని మారాం చేశాడు. పరంధామయ్య రాంబాబును చంకనెత్తు కొని, "నాకు చాలా పనులున్నాయి నాన్నా" అన్నాడు.

"నువ్వు లేకపోతే అమ్మకొడుతుంది నాన్నా" అన్నాడు రాంబాబు.

"ఓస్! అదిట్రా! నేచెపుతాగా అమ్మకి నిన్ను కొట్టవద్దని... ఏమేవ్! రాంబాబుని అస్సలు కొట్టకు" అన్నాడు.

శాంతమ్మ అందుకొని, "అలాగే" అంది, నిజా నికి తనంటే రాంబాబులో ఏర్పడిన భావానికి మన స్సులో బాధపడిందికూడాను. తల్లి రెండుచేతులూ చాపగానే రాకతప్పలేదు రాంబాబుకి. అదివాడికి చిన్నతనంనుంచీ అనుభవంతో వచ్చిన అలవాటు. శాంతమ్మ యెత్తుకొని, "నువ్వల్లరి చెయ్యకపోతే ఎందుకొడతానురా!" అంది పమిటచెంగుతో ముఖం తుడుస్తూనూ. పరంధామయ్య పర్సుతీసి ఓ రూపాయిబిళ్ళ కొడుకు చేతిలోపెట్టి "బాబుని కొట్టవుగా!" అంటూ వెళ్ళి వాకిట్లోవున్న రిక్షా యెక్కాడు. మాపుమేరవరకూ రాంబాబు తల్లి చంకలోంచి తండ్రిరిక్షావంక చూస్తూనేవున్నాడు.

రాంబాబుకి పడిశంపట్టి భారంగా వున్నాడు. బడి ఏగవేయడానికి బాగా వంకదొరికిందని బాగా బాధపడుతున్నట్లు నటించాడు. శాంతమ్మగూడా వాణ్ణి బడికి వెళ్ళమని బలవంతం చెయ్యనూలేదు. రాంబాబు తండ్రి ఇచ్చిపోయిన రూపాయిని గురించి పెద్దపెద్దప్లాన్లు వేశాడు. కాని రాత్రి నిద్రపోయిలేచి మాచుకోనేసరికి తెల్లవారి, అది కాస్తా మాయమయింది. "అమ్మా! రూపాయమ్మా! జేబులో వుండాలి!" అన్నాడు ఖంగారుపడుతూ.

"నే తీసి దాచేలే!" అంది అమ్మ అతని ముఖం వంకన్నా చూడకుంటా. రాంబాబు నోటికి టక్కున తాళం పడిపోయింది. పాపం! తను కోరిన కోరికలన్నీ నీళ్ళుగారిపోయాయి. నాన్న నాకిస్తే అమ్మతీసుకుంది. నాన్నరానీ అని మొదల కుండా వూరుకున్నాడుకాని రోజల్లా రూపాయి మీదనేవుంది మనసు. నా రూపాయి అమ్మ తీసు కోవడం అన్యాయంకాదూ? రూపాయి ఆలోచ నలతో రోజంతా హుషారుగా లేదు. శాంతమ్మ చేసిన వాగ్దానం ప్రకారం రెండు రోజులూ రాం బుని కొట్టనేలేదు ఒక్కదెబ్బనా! రూపాయి ధోరణిలోపడి అసలు గల్లంతుచెయ్యలేదుగూడా!

ఆ వేళ శుక్రవారం. అమ్మదగ్గర్నుంచిరూపాయి ఎలాగయినా కాజెయ్యాలి. పడిశభారం యెక్కువగా వుంది. ముక్కురంధ్రాలు మూసుకుపోయి నోటితో గాలి పీల్చాల్సొస్తోంది. తలంతా బరువుగా వుంది గూడా! తనకంతా తగ్గిపోయినట్లు ఎక్కళ్ళేని ఓపిక తెచ్చుకొని ముఖం కడుక్కొని కాఫీత్రాగి, "బళ్ళోకి వెళతానమ్మా" అన్నాడు రాంబాబు. అతను వెళ్ళనప్పుడు వెళ్లమననూలేదు. వెళతానన్నప్పుడు వెళ్ళద్దనడమెందుకు? "సరే. వెళ్లు." అంది.

రాంబాబు తలక్రిందికి వంచుకుని "మరే! అమ్మా! పుస్తకాలకు ఇవ్వాలట. రూపాయి పట్టుకురమ్మన్నాడు మాస్టారు" అన్నాడు.

శాంతమ్మ ఏమీ మాట్లాడకుండా పెట్టితీసి పౌడరుడబ్బీలోవున్న రూపాయిబిళ్ళ ఇచ్చింది. అసలు గల్లంతు చెయ్యనందుకు ప్రతిఫలంగూడా ఇచ్చింది ఓ పావలా "ఇది నువ్వుంచుకో" అని.

రాంబాబు పుస్తకాలసంచితీసుకొని తనపాచిక పారినందుకు సంతోషిస్తూ గుమ్మందగ్గరదాకా వెళ్లి అక్కణ్ణుంచున్న గోపీని ఏడిపించాలని రూపాయి బిళ్ళను పైకెగరేసి ఇంకా ఏడిపించాలని "ఓరే అన్నయ్యా" అని గర్వంగా రూపాయిబిళ్ళ ఖంగున మోగించాడు.

గోపీకి పుండుమీద కారంరాచినట్లుగావుంది. గోపీకి అనుమానం వేసిందిగూడా రాంబాబు రూపాయి ఎక్కడైనా చెక్కేశాడేమోనని. ఈ ఆలోచన తట్టగానే అమ్మవేపు రెండడుగులు వేసి "అయినా ఎక్కడైనా దొంగతనంచేస్తే నాకెందుకు చూపుతాడు? అమ్మదగ్గరే ఏదోఎత్తు వేసికాజేసివుంటాడు. ఇప్పుడెందుకు? సాయంత్రం రూపాయి ఖర్చుపెట్టింతరువాత చెపుతావాడి పని!" అనుకొని తనూ పుస్తకాలు సర్దుకొని బళ్ళోకి వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం రాంబాబు ఇంటికిరాలేదు. గోపీవస్తే, శాంతమ్మ "తమ్ముడు రాలేదేమిరా? వెళ్ళేప్పుడు అటువేపువెళ్లు" అంది. గోపీకి రాంబాబు తనచేతిలో చిక్కినట్లనిపించింది. రాంబాబు మధ్యాహ్నం మూడున్నరగంటలకి ఇంటికొచ్చాడు.

"మధ్యాహ్నం రాలేదేంరా?" అంది శాంతమ్మ.

"మరే మాబళ్లో ఎవరో అబ్బాయిని చేర్పిస్తూ పళ్లూ, అవీ పంచిపెట్టారమ్మా అందుకనిరాలేదు. ఇక మధ్యాహ్నంనించీ మాకు బడిలేదు!" అన్నాడు రాంబాబు.

గోపాలం సాయంత్రం బళ్ళోనించి ఇంటికి వచ్చేసరికి రాంబాబు ఇంటిముందు పిల్లలతో కోతి-కొమ్మచ్చి ఆడుతున్నాడు. గోపీ గబగబా వాళ్ళమ్మదగ్గరికివెళ్ళి "రాంబాబు ఇవ్వాళ బడికి వెళ్ళలేదుటే! వాళ్లబళ్లోవాళ్లని కనుక్కున్నాను" అన్నాడు.

"నిజంగానా?"

"నిజమమ్మా. నువ్వు రూపాయలిస్తూవుంటే వాడికి బడెందుకు?" అన్నాడు తనఅక్కసునంతా వెళ్ళగ్రక్కుతూ.

"వాడిముఖం వాడేం చేసుకుంటాడ్రా! రూపాయి ఎలా మార్చాలోగూడా తెలియదు. అయినా కనుక్కుంటానుండు" అని శాంతమ్మ అక్కణ్ణించిలేచి ఆడుకుంటూవున్న రాంబాబును పిలిచింది.

అమ్మ కేక వినగానే ఎందుకో రాంబాబు గుండెలు ఒక్కసారి గుభేల్మన్నాయి. ముచ్చెమటలూ పోసేశాయి. చలిజ్వరం వచ్చినట్లుగా వుంది. ఇంతసేపట్నుంచీ ఆటసందడిలో మరిచిపోయిన తలకాయనొప్పి ఇప్పుడు తెలుస్తోంది. అమ్మపిలుస్తోంది. ఎందుకు? తనివ్వాళ చేసిందంతా అమ్మకు తెలిసిందేమో? ఏంచెప్పాలి? ఆలోచన తెగడంలేదు. అమ్మ రెండోపిలుపు. అప్రయత్నంగానే కాళ్లు రెండూ అమ్మవేపు లాక్కెడుతున్నాయి. ఆమె తన ఎదురుగుండా నిలబడి రెండు కళ్లూ తన వేపే కేంద్రీకరించి ముఖంవేపు చూస్తోంది.

"ఇవ్వాళ బళ్ళోకి వెళ్ళేవా?"

"ఆఁ!"

"మరి లేదని చెప్పారుటగా?" అంది.

"ఎవరికి?"

"గోపీకి"

"ఇలారమ్మను ఎవరుచెప్పారో" అన్నాడు రాంబాబు గోపీని ఎలాగయినా దబాయించవచ్చునని.

"ఆరేగోపీ" అని పిలిచింది శాంతమ్మ. గోపి గదిలోంచి బయటకు వచ్చాడు. "ఎవర్రా చెప్పింది నేను బళ్లోకి వెళ్ళలేదని?" అన్నాడు రాంబాబు పెద్దపెద్ద గ్రుడ్లుపెట్టి గోపీవంక చూస్తూ.

"వెంకటేశ్వరులు చెప్పాడు"

"ఏడిశాడు వాడొకసారి పెన్సిలడిగితే ఇవ్వలేదని" తక్షణం వంక చూశాడు. శాంతమ్మ కళ్లు తన మాటలు నమ్మినట్లే కన్పించాయి.

"రూపాయి మాష్టారి కిచ్చావా?" అంది శాంతమ్మ.

"ఓ!" అన్నాడు రాంబాబు

"ఇవ్వలేదటమ్మా" అన్నాడు గోపి

"నువ్వు చూశావేమిటి?" అన్నాడు రాంబాబు

"మాళ్ళేదుగాబట్టి అడుగుతున్నానోయ్ ఏం చేశావని?"

"చూడని వాడివెందుకు చెప్పాలోయ్ మేష్టారివ్వలేదని?"

"నే చూచారా!"

"ఏమిటి చూచింది?"

"ఏవిఁటా లాటరీలో నువ్వు రూపాయి కట్టలా?" అంటూ నిశ్చేష్టుడై నిలబడివున్న రాంబాబు జేబులో చెయ్యిపెట్టి వెలికి లాటరీ చీటీముక్క తీసి వాళ్లమ్మకి చూపించాడు. "ఇదుగో. నే చెప్పేదంతా అబద్ధమనుకుంటావు. బడి ఎగేసి గుళ్ళో కూర్చుని గోళీలు ఆడుతుండగా వెంకటేశ్వర్లు చూచాడట" అనిచెప్పాడు. గోపి తెల్లముఖం వేశాడు. ఒళ్లంతా జ్వరం వచ్చినట్లయిపోతుంది.

"ఏరా వెధవా!" అని శాంతమ్మ రాంబాబు చెవులు పట్టుకొని లోపలికి తీసికెళ్ళింది. రాంబాబుకి ఏం చెప్పడానికీ తోచలేదు. స్థంభానికి ఆనించి "గోపి, తాడు పట్టుకురారా!" అంది గోపీకి అంతకంటె అవకాశం మరెప్పుడూ దొరకదు. గబగబా వెళ్ళి తాడు పట్టుకొచ్చాడు. శాంతమ్మ కొడుకుని స్థంభానికి కట్టివేసి రెండు మూడు దెబ్బలు కొట్టింది. రాంబాబు పెద్దగా ఏడుస్తూ "ఇంకెప్పుడూ చెయ్యనమ్మా!" అని తప్ప ఏమీ అనలేకపోయాడు. ఒకవేపు బ్రద్దలు తలకాయనొప్పి చేస్తోంది. ఆటల సందడిలో మర్చిపోయాడుగాని ఆ నొప్పి మధ్యాహ్నం నుంచీ వుంది. ఏడుస్తూవుంటే గొడ్డలితో తల బ్రద్దలు కొడుతున్నట్లుగా వుంది. శాంతమ్మ కొట్టి "ఇలాగే వుండు. రాత్రికి నీకు అన్నం పెట్టేది లేదు" అని వెళ్ళిపోయి తనలో తనే దుఃఖించింది. చిన్నతనంనుంచీ తను రాంబాబు జీవితాన్ని గురించి శంకించిందంతా నిజమౌతున్నట్లనిపించిందామెకు. రాంబాబు అమావాస్యనాడు జన్మించినందుకు జాతక ప్రకారం అప్పుడే చిన్న చీలిక బయలుదేరింది. ఇలాగే చెడిపోతాడేమోనని ఆమె మదనపడసాగింది. అలాగే గనక రాంబాబు అయిపోతే? ఇంకా చెయ్యవలసిందేమిటి? ఇంత చిన్నవయస్సులో ఎంత అబద్ధం ఎంత ధైర్యంగా చెప్పాడు! తానింతవరకూ తీసుకొంటున్న జాగ్రత్త చాల్లేదన్నమాట. ఇకముందు ఇంకా తీవ్రమైన అప్రమత్తత వహించాలని నిర్ణయించుకుంది.

ఆమెకు అన్నం తిన బుద్ధి వెయ్యలేదు. కొడుకు దిగులే ఎక్కువగా పీడింపసాగింది. కొంచెం సేపటివరకూ రాంబాబు ఏడుపు వినిపించింది గదిలోనుంచి. తరువాత మానేశాడు. రాంబాబుని లోపలపెట్టి తలుపేసి గుమ్మందగ్గరే మంచం వేసుకొని కొడుకు భవిషత్ జీవితాన్ని యెలా దిద్దుకురావాలో ఆలోచిస్తోంది. గోపీకి అన్నం పెట్టి తను వచ్చి రాంబాబు అన్నంకోసం ఏడుస్తాడేమోనని గుమ్మందగ్గరే కాచు కూర్చుంది కాని ఆ విధమైనదేమీ జరగలేదు. "తిక్క బాగా కుదరాలి. లేకపోతే మాట వినడని" మెదలకుండా వూరుకుంది. కన్నతల్లికి నిద్రపట్టలేదు. రాత్రి పదిగంటలకు రాంబాబు మూలుగు విని తలుపు తీసింది. రాంబాబు స్థంభానికి జేరగిలబడి మూలుగుతున్నాడు. కట్లువిప్పి చెయ్యిపట్టుకుంది. వళ్ళంతా కాలిపోతోంది. జ్వరం మంటలుగా వచ్చేసింది. రాంబాబు తోటకూర కాడల్లే వ్రేలాడిపోతున్నాడు.

ఉలికిఉలికి పడుతూ "అమ్మా నీకు దండం పెడతానమ్మా! ఇంకెప్పుడూ చెయ్యనమ్మా నన్ను కొట్టకమ్మా. మంచంమీద పండుకోబెట్టు" జారిపోతూ అంటున్నాడు.

శాంతమ్మ ఖంగారు పడింది. కొడుకును ఎత్తుకొని తీసికెళ్ళి మంచంమీద పండుకోపెట్టింది.

ఒళ్ళంతా భరించలేనంత వేడిగావుంది. తను తాడుతో కొట్టినచోటల్లా వాతలు తేలివున్నాయి. ఆమె ఫలితం ఇంతగా వుంటుందనుకోలేదు.

గోపేని పిలిచి "సోమయాజులుగారింటికి వెళ్ళి విభూతి పట్టుకురారా" అని పిలిచింది. సోమయాజులు రాంబాబు స్థితి విని స్వయంగావచ్చి విభూతి మంత్రించి "ఫరవాలేదులేమ్మా" అని చెప్పిపోయాడు.

తల్లి తను చేసిన పనికి తానే తిట్టుకోసాగింది. తనలో తనే కుమిలికుమిలి ఏడ్చింది. రాంబాబు "అమ్మా కొట్టకమ్మా, నీకుదండం పెడతానమ్మా" అంటూ చేతులెత్తి దండంపెడుతూ "నేవెయ్యనన్నానమ్మా! సోమయాజులు కొడుకు పెద్ద మోటారుసైకిలు వస్తుందని చెప్పాడు. రంగడు కూడా లాటరీవేస్తే నే వేశానమ్మా!...నీకు దణ్ణమమ్మా కొట్టకు."

"అణా పెట్టి మరమరాలు కొన్నాను. నీకు జీడిపప్పంటే ఇష్టమని బేడపెకొన్నాను. ఇంటికి తెస్తే ఎందుకు ఖర్చుపెట్టావని కోప్పడతావని తినేశానమ్మా! ఇంకో అణావుంది"

శాంతమ్మగుండె తరుక్కుపోయింది! "నాన్నా నే కొట్టను నాన్నా! ఇటుచూడు. నేను... అమ్మని", అంది.

"నిజంగానా అమ్మా - ఇక కొట్టవా! నువ్వు భలే మంచిదానివమ్మా-అదుగో మోటారుసైకిలు-బుర్ర్..ర్ర్...వెళ్లిపోతున్నా...గోపే...ఎక్కు... అమ్మ ఇకనన్ను కొట్టదుట!..."

"నాన్నా! ఏం మాటలవి?" అంది ఒత్తుగా వచ్చేఏడుపు ఆపుకొంటూ.

"నాన్నకిచెప్పు... నే మోటారుసైకిలెక్కి వెళ్లిపోయానని-అదుగో వచ్చేశాడునాన్న - హేయ్-నే వెళ్లిపోతున్నా!"ఇదే ధోరణి రాంబాబు.

శాంతమ్మకు భయం ఎక్కువైపోయింది. తన తప్పు క్షమించి తన ప్రాణాన్ని తీసుకొని కొడుకుని రక్షించమని దేవుణ్ణి ప్రార్థించింది. రాంబాబు సంధిప్రేలాపన విని ప్రక్కవాటాలో వుంటున్న సావిత్రి వచ్చి "ఏవిటమ్మా వదినా?"అంది. శాంతమ్మకు పొంగివస్తున్న దుఃఖాన్నంతా సావిత్రిని కావిలించుకొని ఏడ్చింది. "వదినా! నా బాబుని ఈ పాపిష్టి చేతులతో కొట్టి చీకటిగదిలో పెట్టాను" అంది.

"ఫరవాలేదులే! నువ్వు ఖంగారుపడకు. దడుసుకున్నాడేమో. జ్వరం తీవ్రతలో అంటున్న మాటలేగాని ఏంఫరవాలేదు. సాయంత్రం ఇంటిముందే ఆడుకొంటాడమ్మా" అంది.

పరంధామయ్యగారు పిల్లలకి కావలసినవన్నీ, ఆటవస్తువులూ, పళ్లూ అవీ ఓ బుట్టలో పెట్టుకొని ప్రొద్దున్నే బండి దిగాడు. రిక్షా ఎక్కి ఇంటికి వెళుతున్న పరంధామయ్యగార్ని వెనుకనుంచి ఎవరో పిలుస్తున్నారు. రిక్షా ఆపించాడు. సోమయాజులు కొడుకు లాటరీ కంపెనీలో పనిచేసే అతను గబగబా వచ్చి రిక్షాలో కూర్చుని "పోనీవోయ్ రిక్షా"అని "మీ అబ్బాయికి లాటరీలో సైకిలు వచ్చిందండీ! ఇవ్వాళే లాటరీ తీశారు. అది చెప్పడానికే బయలుదేరాను. మీకింకా తెలీదూ?"అన్నాడు.

పరంధామయ్యగారు ఆశ్చర్యంగా "నిజంగానా! ఏ అబ్బాయికి?"అన్నారు.

"మీ చిన్నబ్బాయికండీ, రాంబాబుకి. నేనే వేయించాను లాటరీ- మీకు సైకిలు కావాలంటే సైకిలూ, డబ్బుకావాలంటే డబ్బూ ఇస్తారు" అన్నాడు.

"మా రాంబాబుకేనా? త్వరగా పోనీవోయ్ రిక్షా"అని ఇల్లెప్పుడా అని చూస్తూ కూర్చున్నాడు.

ఇంటికొచ్చేసరికి రాంబాబు ఒళ్లు తెలియని స్థితిలో వున్నాడు. బలికి బాగుంటే అడే పదివేలు అనుకొన్నారు పరంధామయ్యగారు. అమావాస్య ఆదివారంనాడే పుట్టినా తన కడుపున చిచ్చుపెట్టకుండా తేలుకొంటే అదే చాలు అనుకొంది శాంతమ్మ.

---

మీరు ఏది నీతివర్తన అని నమ్మి ఆచరిస్తున్నారో, దానివల్ల మీ జీవితంలో బాధ లెక్కువయితే, బయటి ప్రపంచాన్ని నిందించకండా, మీ "నీతి" తప్పుడు రకానిది అని గ్రహించండి.—రాబర్ట్ లూయీ స్టీవెన్సన్.